క్లుప్తంగా

కేఎంసీలో ఘనంగా స్పోర్ట్స్ డే వేడుకలు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపాల్, ఆసుపత్రి సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో శుక్రవారం సాయంత్రం స్పోర్ట్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కళాశాలలో అభ్యసించిన ఎందరో వైద్య విద్యార్థులు దేశ విదేశాల్లో పేరు ప్రఖ్యాతులు సాధించారన్నారు. అంతేగాక క్రీడల్లోనూ జాతీయ స్థాయిలో రాణించారని చెప్పారు. కళాశాలలో గత రెండు వారాలుగా నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో విజేతలకు వారు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

13న డోన్‌లో గొర్రెలు, మేకల పెంపకందారుల సదస్సు



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్) : గొర్రెలు, మేకల పెంపకందారుల రాష్ట్ర సదస్సును డిసెంబర్ 13వ తేదీన డోన్‌లో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎం.కారన్న తెలిపారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో రాష్ట్ర సదస్సుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గొర్రెలు, మేకల పెంపకందారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఎన్‌ఎస్‌డీఎస్ కింద గొర్రెలు, మేకల కొనుగోలుకు నిధులను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, నాయకులు గురుదాస్,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

20న భగవద్గీత పోటీలు

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 20 వతేదీ ఉదయం 10 గంటల నుంచి స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో భగవద్గీత పోటీలు నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు తెలిపారు. గీతా జయంతిని పురస్కరించుకొని ఈ పోటీలు నిర్వ హిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది మొదటి సారి భగవద్గీత రాత పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రథమ విభాగంలో 5,6, 7 తరగతులకు విద్యార్థులకు 1వ అధ్యాయం, ద్వితీయ విభాగంలో 8,9,10 తరగతుల విద్యార్థులకు 2వ అధ్యాయంలో పోటీలు ఉంటాయని తెలిపారు. రెండు విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి వరుసగా రూ.5,116, రూ.3,116, రూ.2,116 నగదుతో పాటు ప్రశంసా పత్రాలు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. అన్ని పాఠశాలల యాజమాన్యాలు అధిక సంఖ్యలో విద్యార్థులు పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు. వివరాలకు 9505377520 నెంబర్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

పైపులైను పనులు త్వరగా పూర్తి చేయండి

సి.బెళగల్: మండలంలో జల్‌జీవన్ మిషన్ (మంచినీటి సరఫరా) పథకంలో భాగంగా జరుగుతున్న పైపులైను పనులను త్వరగా పూర్తి చేయాలని మండల అధికారులను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఏడుకొండలు ఆదేశించారు. శుక్రవారం ఆయన మండలంలోని ఇనగండ్ల, కంబదహాల్ గ్రామాల్లో పర్యటించి అక్కడ జరుగుతున్న పైపులైన్ పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. ఆయన వెంట సి.బెళగల్, గూడూరు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు గోనేనాయక్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఆటలతో మానసికోల్లాసం

కల్లూరు: ఆటలు ఆడటం వల్ల పిల్లల్లో ఏకాగ్రత పెరగడంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని అలంపూర్ ప్రభుత్వ ఆస్పత్రి సుపరింటెండెంట్, డాక్టర్ సయ్యద్ పాషా, నారాయణ పాఠశాలల ఏజీఎం రమేషకుమార్ అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ పరిధి ఎల్కూరు బంగ్లా ఆవరణలో ఈ కిడ్స్ విభాగంలో నారాయణ ప్రీమియర్ లీగ్ క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి అలంపూర్ ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ సయ్యద్‌పాషా మాట్లాడుతూ పిల్లలలో మానసిక ఎదుగుదలకు క్రీడలు దోహదపడతాయన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు బ్రాంచ్‌ల వారీగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు.

రేపు జ్వాలా తోరణం

కర్నూలు కల్చరల్: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని సంకల్ బాగ్‌లోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి, భవాని సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 26వ తేదీ సాయంత్రం 7 గంటలకు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బ్రాహ్మణ సంఘం కమిటీ సభ్యులు తెలిపారు. అభిషేకం, జ్వాలా తోరణం, 27వ తేదీ ఉదయం 9 గంటలకు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

మళ్లీ జగనన్ననే గెలిపించుకుందాం

- వైఎస్‌ఆర్‌సీపీ పాలనలో ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం
- ఇంటికే ప్రభుత్వ పథకాలు
- వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధాకర్



మామిదాలపాడులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు సిటీ: ప్రజాసంక్షేమం, అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న వైఎస్ జగనన్ననే మళ్లీ సీఎంగా గెలిపించుకుందామని కోడుమూరు ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం కర్నూలు అర్బన్ పరిధిలోని మామిదాలపాడు (38వ వార్డు సచివాలయం), రూరల్ మండల పరిధిలోని తాలిశాపురం గ్రామాల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయా చోట్ల ఎమ్మెల్యే సుధాకర్ వైఎస్‌ఆర్‌సీపీ జెండాను, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా లేనటువంటి సంక్షేమ పథకాలను రాష్ట్రంలో సీఎం వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారని చెప్పారు. ఆయన అధికారంలో ఉంటేనే ఆ పథకాలు అందుతాయన్నారు. గతంలో పేదలకు సంక్షేమ పథకాలకు అర్హత అనేది రాజకీయ నాయకులు నిర్ణయించేవారన్నారు. ఇప్పుడా పరిస్థితి లేదని సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటికి వచ్చి అర్హులను గుర్తించి పథకాలను అందజేస్తున్నారన్నారు. తెలుగు దేశం పాలనలో చంద్రబాబు రైతులకు, మహిళల రుణాలు మాఫీ చేస్తానని చెప్పి మోసం చేశారన్నారు. వైఎస్ జగన్ 2019 ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారన్నారు.

ప్రతిపక్ష నాయకుల మాటలు నమ్మొద్దు

సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న పథకాల ద్వారా రాష్ట్రం శ్రీలంక అయిపోతుందని తప్పుడు ప్రచారం చేసిన టీడీపీ నేతలు ఇప్పుడు అవే పథకాలను పేర్లు మార్చి అమలు చేస్తామని చెబుతున్నారని ఎమ్మెల్యే సుధాకర్ మండిపడ్డారు. టీడీపీ నాయకుల మాయమాటలు నమ్మొద్దని ప్రజలను కోరారు. మామిదాల పాడులో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ గిబ్బన్, వైస్ ఎంపీపీ నెహిమియా, భాస్కర్, రాంబాబు, సచివాలయ కన్వీనర్ యాకోబు, మల్లికార్జున, మహేశ్వరరెడ్డి, మద్దిలేటి, రామకృష్ణ, చిన్నలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణ

సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే జనరంజక పాలన సాధ్యమని కల్లూరు అర్బన్ క్లస్టర్–2 అధ్యక్షుడు, కార్పొరేటర్ శ్రీనివాసులు, జేసీఎస్ కన్వీనర్ ఇన్‌చార్జ్ హనుమంతురెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 32వ వార్డు పోలీసు కాలనీలో ' ఆంధ్రప్రదేశ్‌కు ఎందుకు జగనన్నే కావాలి ', మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 80వ వార్డు సచివాలయంలో 33 రకాల సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. చెన్నమ్మ సర్కిల్ సమీపంలో జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు లక్ష్మీకాంతరెడ్డి, వెంకటేశ్వర్లు, నరసింహులు, శ్వేతారెడ్డి, నారాయణరెడ్డి, నాయకులు కృష్ణమూర్తి, శివశంకర్‌రెడ్డి, శివ, హుస్సేన్ సాహెబ్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో వీర బ్రహ్మేంద్రస్వామి జయంతి వేడుకలు



వీరబ్రహ్మేంద్ర స్వామికి పూజలు నిర్వహిస్తున్న విశ్వ బ్రాహ్మణులు

కర్నూలు(అర్బన్): నగరంలోని వీకర్ సెక్షన్ కాలనీలో శ్రీ విశ్వకర్మ గాయత్రీ దేవాలయ ప్రాంగణంలో శ్రీ వీర బ్రహ్మేంద్ర స్వామి 415వ జయంతి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో విశ్వ బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన ప్రజలు, ముఖ్యంగా మహిళలు దేవాలయానికి వచ్చి పూజలు నిర్వహించారు. దేవాలయ కమిటీ సభ్యులు కమ్మరి నడిపి బ్రహ్మయ్య ఆచారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి, వార్డు కమిటీ సభ్యులు బోయ గంగులు, చిన్న మాధవస్వామి, బ్రహ్మయ్య ఆచారి, కొండయ్య ఆచారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవపూజ ధనుంజయ ఆచారి మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీన విశ్వ బ్రాహ్మణుల కార్తీక వనభోజన కార్యక్రమాలను విశ్వ కర్మ గాయత్రీ దేవాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. క్యారక్రమంలో విశ్వ బ్రాహ్మణ కుటుంబ సభ్యులందరు పాల్గొని మన ఐక్యత చాటాలన్నారు. కార్యక్రమంలో రామయ్య, మధు, వీరయ్య, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

యువతలో చైతన్యం నింపేందుకు కృషి



జై భీమ్ వేడుకల్లో పాల్గొన్న ప్రజాసంఘాల నేతలు

కర్నూలు (అర్బన్) : బడుగు, బలహీన వర్గాలకు చెందిన యువతలో చైతన్యం నింపేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తామని పలు ప్రజాసంఘాల నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జై భీమ్ ఆర్గనైజేషన్ త్రైవార్షిక వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గుండాల కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి యాట ఓబులేసు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎరుకల రాజు, ఇమ్మానియేలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు ఎలాంటి సమస్య వచ్చినా అండగా ఉంటూ భవిష్యత్తులో కుల వివక్షను రూపు మాపేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నాయకంటి ఆనంద్, ప్రధాన కార్యదర్శి రాజేష్, సలహాదారు భాస్కర్ శెట్టి, నాయకులు బాబ్జీ, గోపి, గద్దల రాజు, గుండాల చంద్రశేఖర్, సంగాల డేవిడ్ మాణిక్యరాజు, రవి, మహేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కరువు సహాయక చర్యలు చేపట్టాలి



డీఆర్వో కె.మధుసూధన్ రావుకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని అన్ని మండలాను కరువు ప్రాంతాలుగా ప్రకటించి కరువు సహాయక చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్ఎన్ రసూల్, ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాలోని అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తించాలని సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయించారు. అయితే కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో డీఆర్వో కె.మధుసూధన్ రావుకు ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కర్నూలు రూరల్, తుగ్గలి మండలాలను కూడా కరువుప్రాంతాలుగా గుర్తించాలన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, నాయకులు డి.శ్రీనివాసరావు, మహేష్, నాగరాజు, బీసన్న శ్రీనివాసులు, మల్లికార్జున పాల్గొన్నారు.

కమ్మ వెంకటేశ్వర్లుపై చర్యలు తీసుకోవాలి



బాధితులకు మద్దతుగా దీక్షకు కూర్చున్న కురువ సంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్) : కల్లూరుకు చెందిన కురువ సుగుణ, లక్ష్మీల నుంచి 12 ఏళ్ల క్రితం రూ.15 లక్షలు తీసుకొని మోసం చేసిన డీఎస్పీ యుగంధర్‌బాబు మామ కమ్మ వెంకటేశ్వర్లుపై చర్యలు తీసుకోవాలని కురువ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పత్తికొండ శ్రీనివాసులు, ఎంకే రంగస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం ధర్నా చౌక్‌లో తమకు న్యాయం చేయాలని కురువ సుగుణమ్మ, లక్ష్మీల దీక్షకు దిగారు. వారికి మద్దతుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి, కురువ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తిన కిరణ్‌కుమార్ బీసీ సంక్షేమ సంఘం నాయకులు నక్కల మిట్ట శ్రీనివాసులు, శేషఫణి, కల్లూరు మండల మాజీ ఎంపీపీ పెద్దఅమీన్, అల్లబాబు, పుల్లన్న, వెంకటేశ్వర్లు, పొన్నకల్ నాగేష్, బీసీ తిరుపాలు, శ్రీరాములు, మద్దిలేటి మద్దతు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారులు స్పందించి బాధిత మహిళలకు న్యాయం జరిగేలా చూడాలన్నారు.

విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

కోడుమూరు రూరల్: ఉపాధ్యాయులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించకుంటే చర్యలు తప్పవని కర్నూలు డిప్యూటీ డీఈఓ హనుమంతరావు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని అమడగుంట్ల హైస్కూల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పాఠశాల రికార్డులను, ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించారు. పదవతరగతి విద్యార్థులతో మాట్లాడారు. సిలబస్‌ను సకాలంలో పూర్తి చేసి పది విద్యార్థులను పరీక్షలకు పూర్తి స్థాయిలో సన్నద్ధం చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. హెచ్‌ఎం ప్రతి రోజు ఉపాధ్యాయుల దగ్గరుండి పాఠాలు చెప్పే విధానాన్ని పర్యవేక్షించాలన్నారు. కాగా వర్క్ బుక్స్ సరిదిద్దని ఇద్దరు ఉపాధ్యాయులకు డిప్యూటీ డీఈఓ మెమోలు జారీ చేశారు.

భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేయాలి



ఏపీ భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేయాలని ధర్నా చేస్తున్న న్యాయవాదులు

కర్నూలు (లీగల్) : ఆంధ్రప్రదేశ్ భూ యాజమాన్య హక్కు 2022 జీఓ నెంబర్ 512ను రద్దు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లా కోర్టు ఎదుట సీనియర్ న్యాయవాది బి.చంద్రుడు ఆధ్వర్యంలో శుక్రవారం వారు ధర్నా నిర్వహించారు. కర్నూలు బార్ అసోసియేషన్ అధ్యక్షులు నాగభూషణం నాయుడు, సీనియర్ న్యాయవాదులు వై.జయరాజ్, శ్రీధర్, ఎం.సుబ్బయ్య, వై.శ్రీనివాసులు, బీవీ రమణారెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ భూ యాజమాన్య హక్కు చట్టం వల్ల రైతులకు న్యాయం జరగదన్నారు. కోర్టులో పరిష్కరించాల్సిన కేసులు తహసీల్దార్ ఆఫీస్, ఆర్‌డీఓ ఆఫీస్, జాయింట్ కలెక్టర్‌కు అప్పగించడం సరికాదన్నారు. వెంటనే ఈ చట్టాన్ని రద్దు చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో నందికోట్కూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్, పాపారావు, షఫీ, లక్ష్మణ్, దస్తగిరి, రాజేష్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

అవీ-ఇవీ

మునిసిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

కర్నూలు(సెంట్రల్) : మునిసిపల్ కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం చేయాలన్నారు.

న్యాయమైన పరిహారం ఇచ్చే వరకు పోరాటం

కర్నూలు (సిటీ) : ఆరులైన్ల రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయే రైతులకు న్యాయమైన పరిహారం ఇచ్చే వరకు పోరాటం చేస్తామని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ అన్నారు. శుక్రవారం కర్నూలు రూరల్ మండల పరిధిలోని ఆర్‌కే దుద్యాల గ్రామంలో ఆరు లైన్ల రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయే రైతులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. రైతులకు పరిహారం ఇవ్వక మునుపే పనులు మొదలుపెట్టడం అన్యాయమన్నారు. దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూములను వివిధ నిర్మాణాల పేరుతో నష్టపరిహారం ఇవ్వకుండా తీసుకోవడం సరికాదన్నారు.

నేడు 'ఆనందో బ్రహ్మ ప్రదర్శన'

కర్నూలు కల్చరల్: కర్నూలు కళాకారులు అద్భుతంగా తీర్చిదిద్దిన చిత్రం 'ఆనందో బ్రహ్మ' శనివారం ప్రదర్శించనున్నట్లు చిత్ర నటుడు బైటింటి మీనాక్షి రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు చిత్ర ప్రదర్శన ఉంటుందని తెలిపారు. కృష్ణ చైతన్య దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో తెలుగు భాష గొప్పతనం, పెద్దబాల శిక్ష ప్రాముఖ్యతను చక్కగా తెరకెక్కించారని తెలిపారు.

క్రైం కార్నర్

బైక్ అదుపు తప్పి..

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. 108సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. ఓర్వకల్లు మండలం కొమరోలు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు తమ్మరాజుపల్లెలో బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. గ్రామ సమీపంలో బైక్ అదుపుప్పి జాతీయ రహదారిపై కింద పడ్డాడు. దారిలో వెళ్లే వాహనదారులు గమనించి 108కు సమాచారం ఇవ్వగా సిబ్బంది అక్కడికి చేరుకుని క్షతగాత్రుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. తర్వాత చికిత్స నిమిత్తం నంద్యాల శాంతిరాం ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో వెంకటేశ్వర్లు వద్ద రూ. 4,570 నగదు, మోబైల్, పాన్, ఆధార్ కార్డులతో పాటు డ్రైవింగ్ లైసెన్ ఉంది. వాటిని క్షతగాత్రుడి కుటుంబ సభ్యులకు అందించినట్లు 108 సిబ్బంది ప్రసాద్, తిరుపాల్ తెలిపారు.

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని భారత్‌పెట్రోల్ బంక్ వద్ద శుక్రవారం బైక్ అదుపుతప్పి కింద పడిన ఘటనలో బేతంచెర్లకు చెందిన సురేష్ అనే వ్యక్తి గాయపడ్డాడు. నంద్యాలకు వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. సమాచారం అందుకున్న హైవే పెట్రోల్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నంద్యాల ఆసుపత్రికి తరలించారు.

కుల గణన సర్వే పక్కాగా నిర్వహించాలి

కల్లూరు: కుల గణన సర్వే పక్కాగా నిర్వహించాలని కర్నూలు డివిజనల్ అభివృద్ధి అధికారి (డీఎల్‌డీఓ) బాలకృష్ణారెడ్డి, ఎంపీడీఓ రమణమూర్తి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో కుల గణన సర్వే, వికసిత్ భారత్ సంకల్ప యాత్ర, ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాలపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌డీవో మాట్లాడుతూ సర్వే సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఇంటి యజమానితో మాట్లాడి వివరాలు తెలుసుకోవాలన్నారు. సర్వే నిర్వహణకు గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కుల సంఘాల నాయకులు సహకరించాలన్నారు. అలాగే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ఈ నెల 29 నుంచి డిసెంబర్ 9వ మండలంలో జరుగుతుంద డీఎల్‌డీఓ, ఎంపీడీఓ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులకు చేర్చడమే యాత్ర ఉద్దేశమని తెలిపారు. ఆయుష్మాన్ భారత్, పీఎం ఉజ్వల, కేసీపీ, పేదలకు ఉచిత గృహాలు పథకాలకు అర్హులై ఉండి లబ్ధి పొందకపోతే వర్తింపజేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఆడుదాం ఆంధ్రం కార్యక్రమానికి సంబంధించి నేటి నుంచి సచివాలయంలో రిజిస్ట్రేషన్లు ప్రారంభం కానున్నాయన్నారు. వాలిబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్, కబడ్డీ, కోకో క్రీడాలకు సంబంధించి క్రీడాకారులు సచివాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ రవికిషోర్, ఏఎస్ఓ ప్రతాప్ సాగర్ పాల్గొన్నారు.



బ్లూ లైట్ల వెలుగులో యాంటీబయాటిక్స్‌పై అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌ఓ రామగిడ్డయ్య, తదితరులు

యాంటీబయాటిక్స్‌ను ఇష్టానుసారంగా వాడొద్దు

- డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య

కర్నూలు (హాస్పిటల్) : యాంటీబయాటిక్స్ మందులను ఇష్టానుసారంగా వాడకూడదని, అలా వాడటం వల్ల దుష్ప్రభావాలు ఎదురవుతాయని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య చెప్పారు. ప్రపంచ యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ అవగాహన వారోత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం సాయంత్రం బ్లూ లైట్స్ వెలుతురులో కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డాక్టర్లను తరచూ మార్చకూడదని, ఆర్‌ఎంపీల సలహా మేరకు ఇష్టానుసారంగా ఎవరికి తోచిన విధంగా వారు యాంటీబయాటిక్స్‌ను అవసరానికి మించి వాడకూడదన్నారు. దీనివల్ల అవసరమైన సమయంలో యాంటిబయాటిక్స్ పనిచేయకపోవడంతో పాటు అంతకంటే ఎక్కువ మోతాదులో కొత్త మందులు ఇవ్వాల్సి ఉంటుందని, శరీరం సహకరించకపోవడం వల్ల దుష్ప్రభావాలు ఎదురవుతాయని చెప్పారు. ఈ విషయమై వైద్యసిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అవసరానికి మించి మెడికల్ షాపుల్లో ఈ మందులను తీసుకోవడం కాని, వాడటం కాని చేయకూడదన్నారు వైద్యుల సలహా మేరకు మాత్రమే యాంటిబయాటిక్స్ కోర్సు వాడాలన్నారు. ఈ విషయాలపై పాఠశాలలు, కళాశాలల్లో సైతం విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ ఎల్. భాస్కర్, డీపీఎంఓ డాక్టర్ ఉమ, ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ హేమలత, జిల్లా సర్వైలెన్స్ అధికారి డాక్టర్ నాగప్రసాద్, డెమో ప్రమీలాదేవి, మలేరియా అధికారి నూకరాజు, ఎపడమాలజిస్ట్ రమేష్, డీపీఓ విజయరాజు, ఎస్ఓ హేమసుందర్ పాల్గొన్నారు.

ఆక్సిజన్‌ను సక్రమంగా వినియోగించాలి



అనస్థీషియా వైద్యులు, నర్సింగ్ సిబ్బందితో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరంగారెడ్డి

కర్నూలు (హాస్పిటల్) : ఆసుపత్రుల్లో ప్రాణవాయువును సక్రమంగా వినియోగించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి చెప్పారు. శుక్రవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అనస్థీషియా వైద్యులు, నర్సింగ్ సిబ్బందితో ఆక్సిజన్ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటరంగారెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రిలోని పలు విభాగాల్లో ఉన్న లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్, పీఎస్‌ఏ ప్లాంట్లలోని ఆక్సిజన్ నిల్వల గురించి అవగాహన కల్పించారు. అత్యవసర సమయాల్లో రోగులకు అవసరమైన ఆక్సిజన్ స్థాయిని అంచనా వేసేందుకు నర్సింగ్ సిబ్బందికి అనస్థీషియా వైద్యులు అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, డిప్యూటీ సీఎస్‌ఆర్‌ఎంఓ హేమనళిని, అనస్థీషియా హెచ్‌ఓడీ డాక్టర్ విశాల, ప్రొఫెసర్ కొండారెడ్డి, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్, గ్రేడ్–1 నర్సింగ్ సూపరింటెండెంట్ వెంకట తులసమ్మ, గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణి, సావిత్రి బాయి పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో సత్తాచాటాలి



రాష్ట్ర పోటీలకు ఎంపికైన సీనియర్ మహిళల కబడ్డీ క్రీడాకారులతో రాష్ట్ర అధ్యక్షుడు ఏపీ రెడ్డి

కర్నూలు (టౌన్) : ఈనెల 29 నుంచి డిసెంబర్ 1 వ తేదీ వరకు గోనెగండ్ల మండలంలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో సత్తాచాటాలని ఆంధ్రప్రదేశ్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏపీ రెడ్డి పిలుపు నిచ్చారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ సీనియర్ మహిళల ఎంపిక పోటీలు నిర్వహించారు. అతిథిగా హాజరైన ఆయన కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఎంపికయిన క్రీడాకారులు మరింత పట్టుదలతో రాష్ట్ర పోటీల్లో రాణించాలన్నారు. దేశంలోనే కబడ్డీ క్రీడకు ఎనలేని అదరణ ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ నిర్వహణ కార్యదర్శి కుబేర్‌నాయుడు, జాకీర్ హుస్సేన్, నంద్యాల జిల్లా స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రధాన కార్యదర్శి నాగరాజు పుల్ల న్న రామేశ్వర రెడ్డి, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



బరువు ఎత్తుతున్న మహిళ లిఫ్టర్

కర్నూలు (టౌన్) :విద్యార్థినులు, యువతులు వెయిట్ లిఫ్టింగ్‌లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి జి. జోసఫ్ లక్ష్మయ్య అన్నారు. శుక్రవారం స్థానిక ఆదర్శ విద్యా మందిర్ క్రీడా మైదానంలో రెండో రోజు వివిధ విభాగాల్లో వెయిట్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతల వివరాలను ఆయన వెల్లడించారు. 40 కిలోల విభాగంలో విజయ నగరం జిల్లాకు చెందిన వి. రమాదేవి బంగారు పతకం సాధించింది. బి. సిరి చందనా (కడప, రజతం), పావని (పశ్చిమగోదావరి, కాంస్య పతకం), 45 కేజీల విభాగంలో ఆర్. భవాని (పశ్చిమ గోదావరి, బంగారు పతకం), 82 కేజీల విభాగంలో బి. గీతారెడ్డి (కడప, వెండి పతకం), నవ్యశ్రీ (తూర్పుగోదావరి, కాంస్యం), అండర్–19 విభాగంలో 120 కేజీల బరువెత్తి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన షరీన్ పి. బెన్నీ బంగారు పతకం సాధించింది. 91 కేజీల బరువు ఎత్తి కడప జిల్లాకు చెందిన వెలంగిణీ వేద కాంస్య పతకం సాధించింది. విజేతలకు శనివారం సాయంత్రం బహుమతులు అందజేస్తామని ఆయన వెల్లడించారు.

రేపు రజక ఆత్మగౌరవ మహాసభ

కర్నూలు (న్యూటౌన్): ఈ నెల 26వ తేదీ చలో గుంటూరు రజక ఆత్మగౌరవ మహాసభ నిర్వహిస్తున్నట్లు ఏపీ రజక సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాడాల నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో చంద్రబాబు 50 సంవత్సరాలు వయస్సుగల రజకులకు పింఛన్ ఇస్తానని నమ్మించి మోసం చేశారని ఆరోపించారు. డిమాండ్ల సాధన కోసం చేపట్టే ఆత్మగౌరవ మహాసభకు ఉమ్మడి జిల్లా నుంచి రజకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

26న వీరశైవుల కార్తీక వన భోజనం

కర్నూలు కల్చరల్: వీర శైవ అభ్యుదయ సమాజం ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీన గుత్తి రోడ్‌లోని వీవీఎస్ ఫంక్షన్ హాల్‌లో కార్తీక వన భోజనం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మల్లికార్జునప్ప, కాశీ విశ్వనాథ్ శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. వీర శైవ కుల సంఘీయులు అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.